క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

పాములపాడు: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఏ గ్రామాల్లో ఎంత వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి, ఏఏ దశల్లో ఉన్నాయని ఆరా తీశారు. నిర్మాణాల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. ఉగాది నాటికి టార్గెట్‌పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈ హౌసింగ్ శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు మరవలేనివి

నందికొట్కూరు: బహుజన రాజ్యం కోసం పరితపించినకాన్షీరాం సేవలు మరవలేవని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ని వాళ్లు లర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ని యోజకవర్గ అధ్యక్షుడు స్వాములు, నాగేంద్ర, విజయ భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై తనిఖీ


మిడుతూరు ఆర్బీకేలో పంట నమోదు జాబితా విడుదల చేస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు నాగలూటి గ్రామంలో రబీలో పంట నమోదుపై మండల వ్యవసాయాధికారి పీరునాయక్ బుధవారం క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. పంట నమోదు వివరాలను పోల్చి చూశారు. అనంతరం ఆర్బీకేల్లో పంట నమోదు జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పంటనమోదులో ఏమైన తప్పులు ఉంటే ఆయా గ్రామాల ఆర్‌బీకేలలో సరిచేసుకోవాలన్నారు.

రెండు టిప్పర్లు స్వాధీనం

బండిఆత్మకూరు: అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టప్పర్లను స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాబు తెలిపారు. క్రిష్ణనంది పరిసరాల్లో నుంచి నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట ప్రాంతంలో ఉన్న ఇటుకల బట్టీలకు ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీలతో మట్టి తవ్వుతూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని ప్రసాదు, శివ, మాలిక్, సుదర్శన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామన్నారు.

దేవస్థాన ఒప్పంద ఉద్యోగుల ఔదార్యం


మృతి చెందిన ఉద్యోగి భార్యకు విరాళ చెక్కును అందజేస్తున్న ఈఓ ఎస్ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతి పనిచేస్తున్న డి.రాము జనవరి 30న అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా దేవస్థానం ఉద్యోగులు విరాళాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం దేవస్థానం ఈఓ ఛాంబర్‌లో మృతుని భార్య కనకదుర్గకు ఈఓ ఎస్ లవన్న చేతుల మీదుగా దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ సిబ్బంది వారి నెలవారి వేతనం నుంచి ఒక రోజు వేతనం మొత్తం రూ. 2,72,969 డీడీ రూపంలో అందజేశారు.

మహానందిలో భక్తుల రద్దీ


ఆలయ ప్రాంగణంలో కర్ణాటక భక్తులు

మహానంది: ఉగాది పర్వదినం సమీపిస్తున్న నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలివస్తున్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం మహానందికి వేలాది సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఆలయానికి వచ్చిన కన్నడ భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- 'నాడు–నేడు' కింద అభివృద్ధి పనులు
- 23 కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు
- పాత భవనాలకు మరమ్మతులు


తర్తూరులో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం


జూపాడుబంగ్లాలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు కార్యక్రమం ద్వారా మహర్దశ పట్టనుంది. టీడీపీ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలను విస్మరించటంతో సొంత భవనాల్లేక అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి.కొన్నింటికి సొంత భవనాలు ఉన్నా శిథిలమైనా మరమ్మతులకు కూడా నోచుకున్న దాఖలాల్లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేసింది.

ఒక్కోభవనానికి రూ.16లక్షలు కేటాయింపు

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో 287 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిల్లో 76 కేంద్రాలకు సొంతభవనాల్లేక అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. జూపాడుబంగ్లా మండలంలో 38 కేంద్రాలుండగా అందులో 18 అద్దెభవనాల్లో నిర్వహిస్తుండగా నెలకు సుమారు రూ.1.50లక్షల మేర ఐసీడీఎస్ శాఖ అద్దెలను చెల్లిస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా 23 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో భవన నిర్మాణం నిమిత్తం రూ.16లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. మరమ్మతులకు గురైన భవనాలకు ఒక్కోదానికి రూ.5.50 లక్షల చొప్పున మంజూరు చేసింది. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల -2, మండ్లెం, తంగడంచ, తర్తూరు, జూపాడుబంగ్లా గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు భవనాలను మంజూరు చేసింది. అలాగే పి.లింగాపురం, తాటిపాడు గ్రామాల్లోని కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. నిధులను వెచ్చించి ఆయా గ్రామాల్లోని పీఎస్‌సీ కమిటీల ఆధ్వర్యంలో నిర్మాణ పనులను ప్రారంభించగా వివిధ దశలో ఉన్నాయి.

గర్భిణులకు పోషకాహారం

టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందేది కాదు. దీంతో ప్రసవ సమయంలో గర్భిణులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద నాణ్యమైన పౌష్టికాహార కిట్లను అందజేస్తోంది. అలాగే అంగన్‌వాడీలను ప్రీస్కూళ్లగా మార్చి చిన్నారులకు ఆంగ్ల బోధనతోపాటు ఆడుకునేందుకు ఆట బొమ్మలు, పుస్తకాలు, డైనింగ్ టేబుళ్లు, కుర్చీలను సమకూరుస్తోంది.

భవనం మంజూరు కావడం సంతోషం



పదకొండేళ్ల కాలంగా అంగన్‌వాడీ కేంద్రానికి అద్దెభవనంలోనే నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వాల పాలనలో భవనం మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక భవనం మంజూరు కావడం సంతోషంగా ఉంది. త్వరగా నిర్మాణం పూర్తిచేస్తే అద్దె చెల్లింపు బాధ తప్పుతుంది. ప్రస్తుతం నెలకు రూ.1,300లు అద్దెచెల్లిస్తున్నాం.
– ప్రమీల, అంగన్‌వాడీ వర్కర్, మండ్లెం–2

త్వరలో నిర్మాణం పనులు ప్రారంభిస్తాం



నందికొట్కూరు ప్రాజెక్టు పరిధిలో నాడు–నేడు కింద 23 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.16లక్షల చొప్పన మంజూరయ్యాయి. వాటి నిర్మాణం పనులు ప్రారంభం కాగా కొన్ని పునాదుల స్థాయిలో, కొన్ని బేస్‌మట్ట స్థాయిలో ఉన్నాయి. భవనాల నిర్మాణం పనులు త్వరగా పూర్తిఅయ్యేలా చేయాలని అధికారులను కోరాం. స్థలాల సమస్యలున్న ప్రాంతాల్లో సమస్యల్లేని స్థలాలు కేటాయించాలని సంబంధిత తహసీల్దార్‌లను కోరాం. శిథిలమైన అంగన్‌వాడి భవనాలను ఖాళీచేయించి ఇతర భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నాం.
– కోటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, నందికొట్కూరు

ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

వెలుగోడు: ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు సవరణ జాబితా 2023, రూపకల్పనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడానికి బూత్ లేవల్ అధికారులు, క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించాలని సూచించారు. జాబితాలో మార్పులు చేర్పులు చేసి తుది ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఐ ఆంజనేయులు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కృష్ణనంది హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు: కడమలకాల్వ సమీపంలోని కృష్ణనంది ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు బుధవారం హుండీ కానుల లెక్కింపు నిర్వహించారు. ఏడాది తర్వాత హుండిని లెక్కించడంతో రూ. 97,603 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది రూ. 54,294 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.43,309 ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ తనిఖీ అధికారి కిరణ్‌కుమార్, మాజీ చైర్మెన్ తిరుపంరెడ్డి, సర్పంచ్ నాగమణి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

18న రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన

వెలుగోడు: పట్టణంలోని హజరత్ సయ్యద్ రోఖియా బీ ఉరుసు సందర్భంగా ఈ నెల 18న శనివారం ఉదయం 8.00 గంటలకు రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన (న్యూ క్యాటగిరీ) పోటీలు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. మొదటి విజేతకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 50,000 నగదు అందజేస్తారన్నారు. రెండో బహుమతి రూ.40,000 (దాతలు: వేల్పుల జయపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు డి. అమీరున్ బీ), మూడో బహుమతి – రూ.25,000 (వంగాల వెంకట్రామిరెడ్డి), నాల్గో బహుమతి రూ. 15,000 (వంగాల నాగేశ్వరరెడ్డి, బన్నూరు లక్ష్మిరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, బన్నూరు జనార్దనరెడ్డి), ఐదో బహుమతి రూ. 10,000 (డాక్టర్ శశికళారెడ్డి ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్), ఆరో బహుమతి – రూ.5,000 (అంబాల రామకష్టారెడ్డి, అంబాల నాగలక్ష్మమ్మ) అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దేశం తిరుపెంరెడ్డి 9949613348 యస్. మౌలాలి – 9985569860 అంబాల ప్రభాకరరెడ్డి 9000565066 కె. అమీర్ అలీఖాన్ 9885070691 లను సంప్రదించి చీటీలు తీసుకోవాలన్నారు.

19న ఆరు పండ్లలోపు విభాగం పోటీలు

ఈ నెల 19న ఆరు పండ్లలోపు విభాగం ఎడ్ల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ. 40,000 (దేశం తిరుపెంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి), రెండో బహుమతి రూ.30,000 (నందిరెడ్డి గారి రామిరెడ్డి , నందిరెడ్డి గారి వెంకటేశ్వరమ్మ), మూడో బహుమతి – రూ.20,000 (ముంతల విజయభాస్కరరెడ్డి , బి. శివశంకర్ నాయుడు), నాలుగో బహుమతి రూ.15000 (వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ ఎం.ఇలియాస్‌ఖాన్, గోవిందు, రమణ), ఐదో బహుమతి రూ.10,000 (ఏపీపీ ఆసీఫ్ అలీఖాన్, ఉప సర్పంచ్ ముబీనా), ఆరో బహుమతి రూ.5000 (మోతుకూరు మాజీ సర్పంచ్ యం. నాగేశ్వరరెడ్డి) అందజేస్తారని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని


మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీ నాయక్

బండిఆత్మకూరు: ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోందని ఏపీడీ బాలాజీ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ పనుల కోసం కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా జాబ్ కార్డులు పొందాలన్నారు. గ్రామాల్లోనే పనులు కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు అహర్నిషలు కృషి చేస్తున్నారని చెప్పారు. తర్వాత ఉపాధి కూలీల హాజరు నమోదును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరును ఏ విధంగా వేయాలో వివరించారు. మొదటి ఫొటోకు, రెండో ఫొటోకు నాలుగు గంటల వ్యవధి ఉండాలన్నారు. పండ్ల తోటల పెంపకం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏపీవో వసుధ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమస్యలు ఉంటే చెప్పండి


మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర రావు

కొత్తపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహంలో బాలికలకు ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీ వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే ఉన్నతాధికారులకు తెలియజేస్తే పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. అదేవిధంగా హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ప్రతిపూట ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎస్ఐ రామ్‌నాథ్, న్యాయవాదులు నాగేష్, మాణిక్యరావు, రంగస్వామి, హుస్సేన్ మియా, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పని చూపాలి


ఎస్. ఘణపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డ్ కలిగి, పని అడిగిన ప్రతి కుటుంబానికి పని చూపించాలని ఎంపీడీఓ వెంకటరమణ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం మండలంలోని లక్ష్మాపురం, ఎస్. ఘణపురం గ్రామాలలో జరిగే ఉపాధి పనులను ఆయన పర్యవేక్షించారు. రోజు వారి కూలీ రూ. 257లకు తక్కువ కాకుండా పని చేయించాలని ఈసీకి సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వెంట ప్రథమ చికిత్స కిట్ ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం పండ్ల తోటల సాగు కింద వేసిన మామిడి, జామ, సపోట మొక్కలను ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) అశోక్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు ఉన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ సమావేశ భవనంలో సిబ్బందిని సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూలీల సంఖ్యను పెంచి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జాబ్‌కార్డులో ఉన్న ప్రతి వ్యక్తి ఆధార్‌కార్డును అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కన్నడ భక్తులకు అన్నదానం


నందికొట్కూరులో కన్నడ భక్తులకు అన్నం వడ్డిస్తున్న డాక్టర్ ఏఎస్ రాయుడు


దుద్యాలలో పాదయాత్రికులకు భోజనాన్ని వడ్డిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఉగాది ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం శ్రీశైల పుణ్య క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు అడుగడుగునా అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. నందికొట్కూరులో టీటీడీ కల్యాణం మండపం వద్ద జవ్వాజి ఆంజనేయగౌడు స్మారక ధర్మసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ఏఎస్ రాయుడు ప్రారంభించారు. అన్నదానం కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకు అన్నదాన కర్యాక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్వీ రమణ, ఆ సంఘం సభ్యులు వీరకుమార్, కురుణాకర్, కిశోర్‌గౌడు, విజయ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: శ్రీశైలం మహాక్షేత్రానికి వెళ్లే పాదయాత్రికులకు మండలంలోని దుద్యాల గ్రామ సమీపంలో గ్రామపెద్దలు,యువకులు సహకారంతో బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కర్నూలు నుంచి పాములపాడు, ఇస్కాల, దుద్యాల మీదుగా ఆత్మకూరు, శ్రీశైలం వెళ్లే వారి సౌకర్యార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువత చంద్ర, మల్లేష్, రాము, స్వామన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ సమీపంలోని నాగసాయి ఆశ్రమంలో శ్రీశైలం పాదయాత్రీకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వాహకులు రామానందస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలోని ఇస్కాల గ్రామంలో పాదయాత్రీకుల కోసం డాక్టర్ మగ్బూల్ ఉచితంగా వైద్యశిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఇందులో యాత్రికులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు.

ఆవులు తగిలి వలంటీర్ మృతి

మహానంది: మండలంలోని సీతారామాపురం గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న గౌతమ్(28) మంగళవారం నంద్యాలకు వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో పోట్లాడుకుంటున్న ఆవులు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధుమిత్రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి సర్జరీ చేయించినా కోలుకోలేక బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.

పాదయాత్ర భక్తులకు విస్తృత ఏర్పాట్లు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని వేలాదిగా తరలివస్తున్న కన్నడ భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. కైలాసద్వారం వద్ద భక్తులు సేదతీరేందుకు వీలుగా విశాలమైన షెడ్‌తో పాటు, నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాలిబాటలో అటవీశాఖ, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను బుధవారం దేవస్థానం ఈఓ లవన్న ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీ లించారు. కైలాస ద్వారం వద్ద స్వచ్ఛంద సేవకులు నిర్వహిస్తున్న అన్నదాన శిబిరాన్ని సందర్శించారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, ఏఈఓ ఫణిధర్‌ప్రసాద్, నీటిసరఫరా విభాగం సహాయ ఇంజనీర్ రాజేష్ పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవలందించాలి


కన్నడ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశమైన ఈఓ

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సేవకులు తమకు కేటాయించిన స్థలాల్లో అంకిత భావంతో భక్తులకు సేవలు అందించాలని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న సూచించారు. బుధవారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్ష సమావేశ మందిరంలో కన్నడ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన పలు స్వచ్ఛంద సేవకులకు లాటరీ పద్ధతిలో వివిధ ప్రదేశాలను కేటాయించారు. ఈఓ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవకులు ఉగాది మహోత్సవాల్లో సేవలు అందించడం అదృష్టంగా భావించి అకింత భావంతో పని చేయాలన్నారు. భక్తులతో మర్యాదగా మెలుగుతూ వారు కోరిన సమాచారాన్ని తెలియజేస్తుండాలని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ హెచ్‌బీ వెంకటేష్, ఏఈఓ హరిదాస్, పర్యవేక్షకులు ఉమేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్య వంతమైన దర్శనం కల్పించండి

ఉగాదిమహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి తరలివస్తున్న కన్నడ భక్తులకు శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల సౌకర్య వంతమైన దర్శనం కల్పించాలని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న అధికారులకు సూచించారు. బుధవారం ఆలయ క్యూలైన్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే క్షేత్రానికి కన్నడభక్తుల తాకిడి అధికమైందన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ అందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించాలని ఆదేశించారు. క్యూలైన్లలో నిరంతరం మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను అందిస్తూ ఉండాలని సూచించారు. క్యూ కాంప్లెక్స్‌లో మంచినీటి కుళాయిలు, వాష్‌బేసిన్‌లు కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆల య ప్రచార వ్యవస్థ ద్వారా కన్నడ భాషలోఎప్పటికప్పుడు భక్తులకు సూచనలు తెలియజేస్తుండాలని చెప్పారు. ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామకృష్ణ, ఏఈఓ ఫణిధరప్రసాద్, పర్యవేక్షకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం


మిడుతూరు ఆదర్శ పాఠశాల కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు


పరీక్షా కేంద్రంలోకి చెకింగ్ చేసి పంపుతున్న సిబ్బంది

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 408 మంది విద్యార్థులకు గాను 398 మంది విద్యార్థులు హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. బసిరెడ్డి జూనియర్ కళాశాల కేంద్రంలో 12 మంది, నంది జూనియర్ కళాశాలలో 16, విజ్ఞాన్‌లో 10 మంది గైహజరైనట్లు ఆయా సెంటర్ల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తెలిపారు.

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 180 మందికి 178 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి సలీంబాషా, డీఓ రాఘవేంద్ర తెలిపారు. మిడుతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిడుతూరు, గడివేముల ఆదర్శ పాఠశాల, మిడుతూరు కస్తూర్బా బాలికల విద్యాలయం, గడివేముల బీవీఆర్ కళాశాల విద్యార్థులు పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

ముగ్గురు గైర్హాజరు

బండిఆత్మకూరు: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ తెలిపారు. మొత్తం 124 మంది విద్యార్థులకు గానూ 121 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. తెలుగు సబ్జెక్టులో వంద మంది విద్యార్థులకు 97 మంది విద్యార్థులు, హిందీ లో 24 గానూ 24 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు.

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్‌స్కూలులో బుధవారం ప్రారంభమైన తెలుగు పరీక్షకు 113 మందికి గాను 109 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ రత్నరాధిక, ఆత్మకూరు డీఎస్పీ శృతి వేర్వేరుగా తనిఖీ చేశారు.

శ్రీశైలంలో 281 మంది హాజరు

శ్రీశైలంప్రాజెక్ట్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు బుధవారం 281 మంది హాజరైనట్లు శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి తెలిపారు. శ్రీశైలం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు 299 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

ఆత్మకూరులో ప్రశాంతం

ఆత్మకూరు: పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలల్లో బుధవారం ప్రారంభమైన ఇంటర్‌పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సం మొదటి లాంగ్వేజ్ తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో 36 మంది, థెరిస్సా కళాశాలలో 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదిత్య కళాశాలలో 40 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరిక్షల చీఫ్ వేముల సుజాత తెలిపారు.